ప్రజాశక్తి

బుధవారం 25 సెప్టెంబర్ 2024 | 5 | విజయనగరం




నగర పాలక సంస్థ డిఇలు, ఎఇలు బదిలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగర పాలక సంస్థ లో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న డిఇలు, ఎఇల లను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. విజయనగరం నగర పాలక సంస్థలో డిఇలుగా ఉన్న ఎస్.అప్పారావు, రామసుబ్బరావు, ఎల్‌విఎస్ఎస్ కుమార్ విశాఖపట్నం జివిఎంసికి బదిలీ అయ్యారు. వారి స్థానంలో పిఎస్‌వివి ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, టి.మణికుమార్ జివిఎంసి నుంచి ఇక్కడికి బదిలీపై రానున్నారు. వీరితో పాటు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, పార్వతి కూడా బదిలీ పై జివిఎంసికి వెళ్లనున్నారు. వారి స్థానంలో అక్కడి నుంచి ఎఇలు ఎస్.రవికుమార్, ఎస్.కోటేశ్వరరావు, సిహెచ్ పార్వతి రానున్నారు.

నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో...

ముగ్గురికి నిరాశ



నాగార్జున | గొంప కృష్ణ | తెంటు రాజా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి నాయకులను ఊరిస్తూ వచ్చిన నామినేటెడ్ పదవులను కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు ప్రకటించింది. నెల్లిమర్ల టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజును ఎపి మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈయనతో పాటు చీపురుపల్లికి చెందిన మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావుకు సివిల్ సప్లయి కార్పొరేషన్ సభ్యుడిగా, ఎస్.కోటకు చెందిన ఇందుకూరి సుబ్బలక్ష్మికి ఎపి టూరిజం సభ్యులుగా నియమించింది. జిల్లాలో ఒక్కరికే ఛైర్మన్ పదవి పరిమితం చేయడంతో జిల్లాకు చెందిన మరో ముగ్గురు నాయకులు, వారి అనుయాయులు నిరాశ చెందు తున్నారు. ఎన్నికల సమయంలో జిల్లాలో దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ టిడిపి నాయకులు సీట్ల కోసం పోటీపడిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా చీపురుపల్లి నియోజక వర్గం నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున ఎమ్మెల్యే టిక్కెట్ వస్తుందని ఆశించారు. గత ఐదేళ్లగా నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుంటూ తనకంటూ ఓ ప్రత్యేకతను పొందారు. దీంతో, ఎక్కువ మంది ఆయనకే ఎమ్మెల్యే సీటు వస్తుందని కూడా భావించారు. చివరి క్షణాల్లో ఆయనకు బదులు కళావెంకటరావుకు కట్టబెట్టారు. దీంతో, అప్పట్లో తీవ్ర మనస్థాపానికి గురైన నాగార్జున పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడ్డారు. ఈ పార్టీలోవుండి మీ జీవితాలు నాశనం చేసుకోవద్దు' అని కూడా అసహనం వ్యక్తం చేశారు. ఒకానొక దశలో నియోజకవర్గంలో మెజార్టీ టిడిపి కార్యకర్తలు నాగార్జునకు మద్దతుగా నిలుస్తూ నియోజకవర్గ కేంద్రంలో భారీ ర్యాలీలు కూడా చేపట్టారు. ఆ సందర్భంగా నాగార్జునను నేరుగా పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాష్ట్ర కేంద్రానికి పిలుపించుకుని బుజ్జగించారు. 'నీ రాజకీయ భవిష్యత్తు పార్టీ చూసుకుంటుందని కూడా హామీ ఇచ్చారు. దీంతో, మొత్తబడ్డ నాగార్జున తిరిగి పార్టీలో యథాతథంగా పనిచేస్తున్నారు. దీనికితోడు ఎన్నికల్లో త్యాగం చేసిన వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందంటూ సాక్షాత్తు సిఎం చంద్రబాబు ఇటీవల వ్యాఖ్యలు చేయడంతో నాగార్జునతోపాటు ఆయన అనుచరుల్లోనూ ఆశలు చిగురించినప్పటికీ, పార్టీ అధిష్టానం ఆచర ణలో మొండిచేయి చూపింది. అటు ఎస్.కోట నియోజక వర్గం నుంచి టిడిపి సీటు ఆశించి భంగ పడిన గొంప కృష్ణ ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేసేం దుకు సిద్ధపడ్డారు. వేలాది మందితో సభ కూడా నిర్వహించారు. దీంతో, విజయవాడ పిలిపించుకున్న లోకేష్, చంద్రబాబు భవిష్యత్‌లో న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో, ఆయన కూడా మెత్తబడి పోటీచేసే ఆలోచన నుంచి వెనక్కి తగ్గడమే కాకుండా నియోజకవర్గ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. కనీసం నామినేటెడ్ పదవితోనైనా గౌరవం దక్కుతుందని ఆశపడ్డ ఆయనకు నిరాశే ఎదురైంది. దీంతో, ఆయన అనుయాయులు పార్టీ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక బొబ్బిలి నియోజక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడుకు కూడా నామినేటెడ్ పదవి దక్కలేదు. వాస్తవానికి ఆయన కూడా బొబ్బిలి నుంచి ఎమ్మెల్యే సీటు ఆశించారు. అయితే, బొబ్బిలి రాజులతో ఉన్న సాన్నిహిత్యం వల్ల అధిష్టానం వరకు వెళ్లలేదు. అదే కృతజ్ఞతా భావంతో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన వ్యవహరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గానికి లోకేష్ వచ్చినప్పుడు లక్ష్మునాయుడుకు సముచిత స్థానం కల్పించాలంటూ బేబీ నాయన కోరిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన లోకేష్ 'గతంతో పొరపాటు జరిగింది... ఈ సారి అటువంటి పొరపాటు లేకుండా చూసు కుంటాను' అంటూ నిండు సభలో మాటిచ్చారు. ప్రస్తుతం ఆ మాట నిలబెట్టుకోకపోవడంతో నియోజకవర్గంలోని లక్ష్మునాయుడు అనుయాయులు అగ్గిమీద గుగ్గిలమౌతున్నారు. ఇలా ఈ మూడు నియోజకవర్గాల్లోనూ పార్టీ తీరుపై తెలుగు తమ్ముళ్లలో అసహనం పెరుగుతోంది.

మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌గా కర్రోతు బంగార్రాజు

నియోజవర్గ టిడిపిలో నూతన ఉత్తేజం

ప్రజాశక్తి- భోగాపురం



నెల్లిమర్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో నూతనోత్తేజం నెలకొంది. రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌గా నియోజవర్గం టిడిపి ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజును నియమిస్తూ ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఆపార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో మంగళవారం పండుగ వాతావరణం నెలకొంది. ఇటీవల ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ వస్తుందని ఆయన భావించారు. కాని ఇంతలో పొత్తుల్లో భాగంగా జనసేన నాయకులు లోకం మాధవికి కేటాయిం చడంతో బంగార్రాజు త్యాగం చేయాల్సి వచ్చింది. మాధవి ఎమ్మెల్యేగా గెలుపొందేందుకు బంగార్రాజు తనవంతు సహకారం అందించారు. ఆయనకు తొలుత ఎమ్మెల్సీ ఇస్తారని అనుకున్నారు. కాని అవి ప్రస్తుతానికి ఖాళీ అయ్యే పరిస్థితి లేకపోవడంతో క్యాబినెట్ హోదాలో మంచి పదవి వస్తుందని ఆయన అభిమానులు ఊహించారు. అందుకు తగ్గట్టుగానే మార్క్‌ఫెడ్ ఛైర్మన్ పదవిని ప్రభుత్వం కేటాయించింది. ఎన్నికలకు ముందు ప్రచారంలో భాగంగా నాతవలసలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు నాయుడు బంగార్రాజుకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా లోకం మాధవిని గెలిపించండి బంగార్రాజు భవిష్యత్తును నేను చూసుకుంటానని అప్పట్లో ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే మంచి పదవి వచ్చిందని పలువురు అనుకుంటున్నారు. ఈనేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పోలిపల్లిలోని బంగార్రాజు స్వగృహం కోలాహలంగా మారింది. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వచ్చి బంగార్రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలోని పైడితల్లి అమ్మవారిని ఎంపీ, మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యన్నారాయణతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, నారా లోకేష్, అలాగే మంత్రి కొండపల్లి శ్రీనివాసరావుతో పాటు అశోక్ గజపతిరాజుతో పాటు జిల్లా పెద్దలందరికి రుణపడి ఉంటానని అన్నారు. ఇచ్చిన పదవికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తానని బంగార్రాజు తెలిపారు.

99శాతం ఇ-క్రాప్ నమోదు

- 81శాతం ఇకెవైసి
- నేటితో ముగియనున్న గడువు
- అవకాశమిస్తే ఈ నెలాఖరు వరకు 100శాతం పూర్తి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ఇకెవైసి నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఇ-క్రాప్ నమోదు 99శాతానికి చేరింది. ఇకెవైసి మాత్రం 81శాతం వద్ద ఉంది. నేటితో (బుధవారం)తో అధికార యంత్రాంగం ప్రకటించిన సమయం ముగియనుంది. ఈనెలాఖరు వరకు అవకాశం ఇస్తే ఇ-క్రాప్‌తోపాటు ఇకెవైసి కూడా శతశాతం నమోదయ్యే అవకాశాలున్నాయని క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న వ్యవసాయ సిబ్బంది చెబుతున్నారు. అవకాశం ఉంటుందా? లేదా ముందుగా ప్రకటించిన విధంగా ఈనెల 25తోనే తుదిగడువు ముగుస్తుందా? అన్నది వేచి చూడాల్సిందే. జిల్లాలో వరి, మొక్కజొన్న, పత్తి, నువ్వులు, జీడిమామిడి పంటలకు బీమా పథకం వర్తిస్తుంది. ఈనేపథ్యంలో ఈ పంటలన్నింటినీ ప్రభుత్వం తరపున ఇకెవైసితో కూడిన ఇ-క్రాప్ నమోదు ప్రభుత్వం తరపున చేపడుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో ఈ నాలుగు పంటలు కలిపి సుమారు 3.61లక్షల మేర సాగైంది. ఇందులో 2,09,540 మంది రైతులకు చెందిన 3,56,786 ఎకరాల వరకు ఇ-క్రాప్ నమోదు పూర్తయ్యింది. ఇందులో 2,66,173 విస్తీర్ణానికి సంబంధించి 2,07,188 మంది రైతులు మాత్రమే ఇకెవైసి పూర్తి చేసుకున్నారు. మిగిలిన 49,548 ఎకరాలకు సంబంధించిన 49,720 మంది రైతులు ఇకెవైసి చేయించుకోవాల్సివుంది. పంటల వారీగా పరిశీలిస్తే వరి 82శాతం, మొక్కజొన్న 78శాతం, పత్తి 88శాతం, జీడిమామిడి 81శాతం ఇకెవైసి పూర్తైంది. నువ్వుల పంట చేతికి వచ్చే సమయానికి ఇ-క్రాప్ బుకింగ్ ప్రారంభం కాకపోవడంతో ఆయా రైతుల కష్టనష్టాలతో పాటు ప్రభుత్వం తరపున సాయం అందే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో గ్రామాల్లోని రైతులంతా సచివాలయం పరిధిలోని వ్యవసాయశాఖ సహాయకులను సంప్రదించి నమోదు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తొలుత ఈనెల 15లోపు ఇ-క్రాప్ నమోదు చేసుకోవాల్సివుంది. అప్పటికీ 50శాతం మించకపోవడంతో ఈనెల 25వరకు పొడిగించారు. ఆ తరువాత డేటా ఎంట్రీ మొదలవుతుంది. ఈనెల 30నాటికి జాబితా ఖరారు చేసి గ్రామ సభల్లో ప్రవేశపెడతారు. అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం తుదిజాబితాను ప్రభుత్వానికి నివేదిస్తారు. ఇప్పటికీ పూర్తికపోవడంతో ప్రభుత్వం గడువుతేదీ పెంచుతుందా? లేదా అన్నదానిపై ఆసక్తికర చర్చనడుస్తోంది. మరో రోజే గడువు ఉండడంతో ఇ-క్రాప్ బుకింగ్, ఇకెవైసి నమోదు గ్రామాల్లో ముమ్మరంగానే సాగుతోంది. రైతులు ప్రభుత్వ సబ్సిడీని పొందాలన్నా, చివరకు పంటల బీమా వర్తించాలన్నా, కనీస మద్దతు ధర పొందాలన్నా ప్రభుత్వం ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే.

వర్షాలు పట్ల అప్రమత్తం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో వచ్చే మూడు రోజుల్లో వర్ష సూచనలు వున్నాయని, అధికారులంతా తమ మండలాల్లో అప్రమత్తంగా వుండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. అమరావతిలోని వాతావరణ కేంద్రం నుంచి అందిన సమాచారం ప్రకారం మంగళ, బుధవారాల్లో జిల్లాలో చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశం వుందన్నారు. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని పేర్కొన్నారు. గురువారం కూడా అధిక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం వుందన్నారు. అన్ని మండలాల్లోనూ కంట్రోల్ రూంలు తెరచి నిరంతరం అప్రమత్తంగా వుండాలని సూచించారు. జిల్లాలో చెరువులు, కుంటలు నిండి వున్నందున వాటి గట్లు తెగిపోవడం, కట్టల పైనుంచి నీరు ప్రవహించడం వంటి ఘటనలకు అవకాశం వున్నందున వాటిపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. ప్రజలు ఉధతంగా ప్రవహించే వాగులు, గెడ్డలు దాటేప్రయత్నం చేయకుండా కాపలా వుంచాలని సూచించారు.

ఉత్సవాల విజయవంతానికి చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అక్టోబర్ 14,15 తేదీలలో నిర్వహించనున్న పైడితల్లి అమ్మవారి సిరిమాను జాతరకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పేర్కొన్నారు. సిరిమానోత్సవంలో ప్రధాన ఘట్టమైన సిరిమాను తరలింపు ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకట్రావు, పైడితల్లమ్మ దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి.వి.వి.ప్రసాదరావు, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సిరిమాను తరలించే ప్రాంతాలలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు పరిశీలన చేపట్టారు. జమ్ము ప్రాంతం నుండి రింగ్ రోడ్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, బాలాజీ జంక్షన్, ఆర్ టి సి కాంప్లెక్స్, వనంగుడి, ఎన్ సి యస్, గంటస్తంభం, చదురుగుడి, మీదుగా హుకుంపేట వరకు పర్యటించి ఆయా ప్రాంతాలలో గుంతలను పరిశీలించారు. వెంటనే గుంతలను పూడ్చాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట ఇఇ కె.శ్రీనివాసరావు, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలి

నేషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ జస్వీందర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

విద్యార్థుల్లో నులి పరుగులు నివారణకు అల్బెండజోల్ మాత్ర తప్పనిసరిగా ఆరునెలలకొకసారి వేసుకోవాలని ఎవిడెన్స్ యాక్షన్ సంస్థ జాతీయ ప్రోగ్రాం అధికారి జస్వీందర్ తెలిపారు. డి-వార్మింగ్ డే గురించి తెలుసుకునేందుకు ఆమె జిల్లాలో మంగళవారం పర్యటించారు. నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్ వాడి కేంద్రాలను సందర్శించి సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్ర వేసుకోవడం తో పాటు తరుచూ చేతులు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవాలని, శుభ్రమైన టాయిలెట్స్ వాడడంతో పాటు శుభ్రమైన మంచి నీరు తాగాలని పిల్లలకు సూచించారు

వినూత్నంగా విజయనగరం ఉత్సవాలు

13 వేదికల్లో కార్యక్రమాలు : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ఈ ఏడాది విభిన్నంగా విజయనగరం ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. ఉత్సవాల నిర్వహణపై కమిటీ సభ్యులు, జీవితకాల సభ్యులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. నాలుగు రోజుల్లో కార్యక్రమాలను ఖరారు చేయాలని సూచించారు. ఉత్సవాలకు పలువురు ప్రముఖులు వచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా భారీ స్థాయిలో ఏర్పాట్లను చేయాలని చెప్పారు. ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్ణయించిన వేదికలు, ఏర్పాటు చేసిన కార్యక్రమాలు, అక్కడ చేయాల్సిన ఏర్పాట్లుపై చర్చించారు. అక్టోబరు 13న ఉత్సవాల ప్రారంభ ర్యాలీని పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభించి, అయోధ్యా మైదానం వరకు నిర్వహించాలని, ప్రారంభ కార్యక్రమాన్ని అయోధ్యా మైదానంలోనే ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ర్యాలీని వివిధ జానపద కళారూపాలతో, సుమారు 15వేల మందితో నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. అయోధ్యా మైదానంలో ప్రారంభ కార్యక్రమంతోపాటు 13, 14 తేదీల్లో రెండు రోజులు సాయంత్రం మెగా కల్చరల్ ఈవెంట్‌ను నిర్వహిస్తామన్నారు. మహారాజా సంగీత, నృత్య కళాశాలలో ఫ్లవర్ అండ్ ఫ్రూట్‌షో, కోటలో వైజ్ఞానిక, స్టాంప్స్, నాణేల ప్రదర్శన, గురజాడ కళాభారతిలో నాటక ప్రదర్శన, విజ్జీ స్టేడియంలో క్రీడాపోటీలు, రాజీవ్ స్టేడియంలో హెలీకాప్టర్ రైడ్, ఆనందగజపతి కళాక్షేత్రంలో సాంస్కతిక కార్యక్రమాలు, బొంకులదిబ్బ వద్ద సురభి నాటక ప్రదర్శన, కోట ముందు భాగంలో పులివేషాల ప్రదర్శన, ట్యాంకుబండ్ రోడ్డు మాన్సాస్ గ్రౌండ్‌లో సారస్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. లయన్స్ క్లబ్‌లో జానపద కళల ప్రదర్శన, ఎంఆర్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో కవిసమ్మేళనాలు, ఆధ్యాత్మిక కచేరీలను నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, బొబ్బిలి ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ, కమిటీల అధికారిక సభ్యులు, అనధికార సభ్యులు, లైఫ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

యువతను మేల్కొలిపేందుకు 'సంకల్పం'

ప్రజాశక్తి-విజయనగరం కోట



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

మాదక ద్రవ్యాల అలవాటుతో బానిసలుగా మారేందుకు ఎంతో సమయం పట్టదని, కావున విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్‌పి వకుల్ జిందాల్ పిలుపు నిచ్చారు. యువతను మేల్కొలి పేందుకు కళాశాలల్లో 'సంకల్పం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువతను సన్మార్గంలో నడిపి, వారిలో వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపర్చి, ఉన్నత లక్ష్యాలను సాధింపజేసేందుకు విజయనగరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్- కన్వెషన్ సెంటర్‌లో మెగా ఇంపాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌పి మాట్లాడుతూ నేడు సమాజం ఎదుర్కొంటున్న సమస్యల్లో యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారడమన్నది ప్రధానంగా ఉందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన యువత ఏవిధంగా చెడిపోతున్నారో వివరించి, వారిని తిరిగి సన్మార్గంలో నడిపేందుకు జిల్లా పోలీసుశాఖ 'సంకల్పం' అనే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాల్లో నిర్వహించి విద్యార్థులను చైతన్యవంతులు చేస్తున్నామన్నారు. డ్రగ్స్ వినియోగాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వాలు మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేకంగా చట్టాలను రూపొందించి, శిక్షలను కఠినతరం చేశాయన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జిల్లా కన్వీనరు డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, రోటరీ అధ్యక్షులు జి. వినోద్ కుమార్, శ్రీనివాస సోను, సీతం కాలేజి డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రముఖ మోటివేషనల్ స్పీకరు గంప నాగేశ్వరరావు, సెక్రటరీ బి. నాగ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ తరుపున విశిష్ట సేవలందించిన రోటేరియన్స్ లను ఎస్‌పి సత్కరించి, జ్ఞాపికలను అందజేసారు.



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ నల్లనయ్య తదితరులు

ఆరోగ్య ప్రదాతలు పారిశుధ్య కార్మికులు

సత్కార సభలో మేయర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారిశుధ్య కార్మికులు ప్రజారోగ్య ప్రదాతలని మేయర్ విజయలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. విజయవాడ వరదల్లో విశేష సేవలు అందించిన 150 మంది పారిశుధ్య కార్మికులకు, సహాయక చర్యల్లో పాల్గొన్న అధికారులకు, సిబ్బందికి మంగళవారం ఆనంద గజపతి ఆడిటోరియంలో ఘనంగా సత్కరించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజలను ఆరోగ్యవంతంగా ఉంచుతూ, నగరాన్ని పరిశుభ్ర పరుస్తూ విశేషమైన సేవలు అందిస్తున్న పారిశుధ్య కార్మికులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ సత్కార గ్రహీతల సేవలను ఆదర్శంగా తీసుకుని మిగిలిన వారంతా పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. కరోనా సమయంలో అత్యంత విలువైన సేవలను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఇఇ కె.శ్రీనివాసరావు, ఎసిపి అమ్మాజీ రావు, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పట్నాల వెంకటేశ్వరరావు, పారిశుధ్య పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

30న మహిళా గర్జన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాజంలో మహిళలపైనా చిన్నారులపైనా పెరిగిపోతున్న దాడులను ప్రతిఘటించేందుకు, ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు వాజీ చానల్, మహిళా గర్జన కమిటీ సంయుక్తంగా ఈ నెల 30న ఉదయం 9 గంటలకు మహిళా గర్జన అనే పేరుతో కోట జంక్షన్ వద్ద కార్యక్రమాన్ని తలపెట్టింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కోట వద్ద జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని, ప్రతీ ఒక్కరూ తమవంతు బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాజీ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ గోటేటి హిమబిందు, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి సిఇఒగా సత్యనారాయణ బాధ్యతలు స్వీకరణ

విజయనగరం టౌన్ : జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారిగా నియమితులైన బివి సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు . ఈ సందర్భంగా ఆయన జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

వ్యాసరచన పోటీల్లో గురజాడ విద్యార్థుల ప్రతిభ

విజయనగరం టౌన్ : టాటా బిల్డింగ్ ఇండియా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గురజాడ విద్యార్థులు ప్రతిభ చూపారు. గెలుపొందిన విద్యార్థులు ఎ.చామంతి, ఎం.మిథిరాజ్, వై.తేజస్విని, జి.షర్మిల, వై.కారుణ్య , కె .మొదినిలను పాఠశాల డైరెక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, కరస్పాండెంట్ ఎం.స్వరూప, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్ అభినందించారు.

పులి వేష పోటీలకు ఆహ్వానం

విజయనగరం కోట : వచ్చేనెల 13,14తేదీల్లో విజయనగరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న పులి వేష పోటీలకు ఆహ్వానం పలుకుతున్నట్లు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి, పులి వేషాల కమిటీ సభ్యులు ఆర్ఎస్ జాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న పులి వేష బృందాలు పాల్గొనవచ్చని తెలిపారు.ఈ కమిటీలో డాక్టర్ తిరుమల ప్రసాద్, ఎస్ ఎన్ ఎం రాజు ఉన్నారని, ఇతర వివరాలకు 9490066050, 9440155007 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

రేషన్ బియ్యం హాంఫట్

గ్రీవెన్సులో ఫిర్యాదుతో పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందిస్తున్న బియ్యం హాంఫట్ అవుతున్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ డీలరు, బియ్యాన్ని సరఫరా చేస్తున్న వ్యాన్ డ్రైవర్లు కుమ్మక్కై పేదలకు పంపిణీ చేయకుండా పక్కదారి పట్టిస్తున్నారు. విటి అగ్రహారం 35వ డివిజన్ పరిధిలోని రేషన్ డీలర్, పంపిణీ చేస్తున్న వ్యాన్ డ్రైవర్ కలిసి పేదలకు అందాల్సిన బియ్యాన్ని సుమారు 450 కేజీల దగ్గర మాయం చేశారు.

గణేష్ నగర వాసులకు పంపిణీచేసేందుకు డీలర్ ముప్పిడి బంగారు శెట్టికి ప్రతి నెలా 99 క్వింటాల బియ్యం అందుతుండేవి. అయితే వ్యాన్ ద్వారా అన్ని బియ్యం పంపిణీ చేయడం సాధ్యం కాకపోవడంతో కోటా ద్వారా సగం బియ్యం, వ్యాన్ ద్వారా సగం బియ్యాన్ని పంపిణీ చేసేవారు. ఈనెల 20వ తేదీ దాటినా వ్యాన్ రాకపోవడంతో ప్రజలు దీనిపై స్థానిక సచివాలయ విఆర్ఒకు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ కార్యాలయం డిటికి విఆర్ఒ సమాచారం ఇవ్వడంతో స్పందించిన అధికారులు సచివాలయానికి వచ్చి వాన్ డ్రైవర్ రెక్కా జనార్దన్ రెడ్డి , డీలర్ బంగారు శెట్టిని పిలిపించి రెండు రోజుల్లో బియ్యం పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా పేదలకు బియ్యం అందకపోవడంతో బాధితులంతా సోమవారం ప్రజా సమస్య పరిష్కార వేదికలో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే బియ్యం పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం బాధితులకు బియ్యం పంపిణీ చేశారు.

తరగతుల నిర్వహణకు వసతి కల్పించండి

ఎమ్మెల్సీకి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదులు కేటాయించాలని ఎమ్మెల్సీ పి.రఘువర్మకు కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బి సుభ, అధ్యాపకులు వినతినిచ్చారు. మంగళవారంఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు పాకలపాటి రఘువర్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. 400 మంది విద్యార్థులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నప్పటికీ, క్లాసులు నిర్వహించుకోవడానికి తగిన రూములు లేవని, ప్రభుత్వానికి సంబంధించిన బిల్డింగ్ లేకపోతే , ప్రైవేటు బిల్డింగుల నైనా కళాశాలకు తాత్కాలికంగా కేటాయించాలని ఈ సందర్భంగా ఆయనను కోరారు. రఘువర్మ స్పందిస్తూ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ తో మాట్లాడి, పది రోజులు లోపే మీకు రూమ్‌లు ఏర్పాటుకు కృషి చేస్తామని, జిల్లా కేంద్రంలోని ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బలోపేతం చేయవలసిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పి.జయలక్ష్మి, డాక్టర్ జయపాలరావు, డాక్టర్ శ్రీవాణి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బదిలీ అధికారులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో వివిధ హోదాల్లో పనిచేస్తూ ఇతర జిల్లాలకు బదిలీ అయిన పలువురు జిల్లా స్థాయి అధికారులు మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను కలెక్టరేట్‌లో కలిశారు. జిల్లాలో డ్వామాలో ఎఒగా పనిచేస్తూ జిల్లాపరిషత్ సిఇఒగా నియమితులైన సత్యనారాయణ, శ్రీకాకుళం జిల్లా డ్వామా పీడీగా నియమితులైన సుధాకర్, డ్వామాలో ఏపీడీగా చేస్తూ పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీ అధికారిగా బదిలీ అయిన అరుణశ్రీ, అదే జిల్లాకు జిల్లాపరిషత్ సిఇఒగా బదిలీపై వెళ్తున్న లక్ష్మణ్, విశాఖ జెడ్‌పి డిప్యూటీ సిఇఓగా వెళుతున్న రాజ్‌కుమార్ తదితరులు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. వారందరినీ జిల్లా కలెక్టర్ అభినందిస్తూ జిల్లాలో వారు అందించిన సేవలను కొనియాడారు. ఆయా జిల్లాల్లో తమకు నియమించిన స్థానాల్లో సమర్థులైన అధికారులుగా పేరు తెచ్చుకోవాలని అభిలషించారు.

సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గద్దె



చీపురుపల్లి: సివిల్ సప్లయ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవులలో బాబూరావుకి చోటు దక్కడం స్థానిక ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గద్దే బాబూరావు 1987 నుంచి 1989 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మినిమం వేజెస్ బోర్డు ఛైర్మన్‌గా, 1989లో ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ గాను, 1984 తరువాత రెండు పర్యాయాలు చీపురుపల్లి ఆర్ఇసియస్ ఎలక్టెడ్ ఛైర్మన్‌తో పాటు ఒక దఫా నామినేటెడ్ పద్దతిలో ఆర్ఇసియస్ ఛైర్మన్‌గా పని చేశారు. ఆముదాలవలస సుగర్ ఫ్యాక్టరీ ఛైర్మన్‌గా కూడా గద్దె కొంతకాలం పని చేశారు. ప్రభుత్వ విప్‌తో పాటు రెండు పర్యాయాలు చీపురుపల్లి ఎమ్మెల్యేగా, 1984లో ఎంఎల్‌సిగా గద్దె బాబూరావు పని చేశారు.

ఇళ్ల నిర్మాణాలు శతశాతం పూర్తి చేయాలి

రామభద్రపురం: 'మన ఇళ్ళు మన గౌరవం' కార్యక్రమం కింద మంజూరైన ఇళ్ళు శతశాతం నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ రమామణి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నోడల్ అధికారులు, పంచాయతీ కార్యదర్సులు, ఇంజనీరింగ్ సహాయకులతో హౌసింగ్ డిఇ పలగర అప్పయ్య, ఇఒపిఆర్‌డి అక్కరావుల ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె 2025 మార్చి నాటికి, ఇళ్ళు మంజూరైన లబ్ధిదారులతో శతశాతం నిర్మాణాలు పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. సంబధిత అధికారులు సక్రమంగా పర్యవేక్షణ జరిపి కట్టడాలు పరిశీలించి స్టేజి వైజ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఉద్యోగుల ఆందోళన

నెల్లిమర్ల: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మద్యం దుకాణం ఉద్యోగులు మంగళవారం స్థానిక ఎపి బెవరేజస్ కార్పొరేషన్ గోడౌన్ వద్ద ఆందోళన చేపట్టారు. మద్యం దుకాణంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మేన్, సెక్యూరిటీ ఉద్యోగులు నిరసన చేపట్టి అసిస్టెంట్ మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నూతన మద్యం విధానం తీసుకు రావడంతో తమకు నష్టం జరిగే ప్రమాదం ఉందని తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

30 నుంచి నిరవధిక సమ్మె

నెల్లిమర్ల: ఈ నెల 30 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు సిహెచ్‌సి కాంట్రాక్టు ఉద్యోగులు, పారి శుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది తెలిపారు. మంగళవారం వారు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సిహెచ్‌సి వైద్యాధికారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు కనీస వేతనం రూ.16వేలు ఇవ్వకుండా ఏదో రెండు, మూడు నెలలకు ఒకసారి రూ.9వేలు, రూ.11200 చెల్లిస్తున్నారని చెప్పారు. సెక్యూరిటీ సిబ్బందికి రూ.12,600 చెల్లించాల్సి ఉండగా రూ.8వేల నుంచి 10వేలు చెల్లిస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించక పోవడంతో ఈ నెల 30 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

బొబ్బిలిరూరల్ : పంచాయతీల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సభ్యులు ఆశాఖ ఎఇ ఎల్లంనాయుడును నిలదీశారు. మంగళవారం వైస్ ఎంపిపి ఎ.శంకర్రావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జగన్నాథపురం, శివడ వలస, సిహెచ్ బొడ్డవలస తదితర ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఇటీవల వర్షాలకు దెబ్బతిన్నాయని విద్యుత్ వైర్లు క్రిందకు వేలాడుతున్నాయని వాటిని సరిచేయాలని ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదని నిలదీశారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రగతిని వివరించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రవికుమార్, వివిధ శాఖ అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

భోగాపురం : భోగాపురం పంచాయతీలోని కారి గొల్లపేట గ్రామంలోనున్న రాముడు చెరువు ఆక్రమణకు గురైందని గ్రామానికి చెందిన యువకులు తహాశీల్దార్ ఎం. సురేష్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. చాకివలస గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు జెసిబితో లెవెల్ చేసి మట్టి వేసి కప్పేసారని తెలిపారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహాశీల్దార్ వారికి తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

గరివిడి: స్థానిక శ్రీరామ జూనియర్, డిగ్రీ కాలేజీ ఎదురుగా మంగళవారం ఉదయం బస్సు ఢీ కొని యువకుడు మృతి చెందాడు. కొండ లక్ష్మీపురం గ్రామానికి చెందిన రెడ్డి నవీన్ (31) కిరాణా సామాన్లు కోసం ద్విచక్ర వాహనంపై గరివిడి వెళుతుండగా ఆర్‌టిసి బస్సు ఢీ కొని మృతి చెందాడని ఎస్ఐ బి. లోకేష్ తెలిపారు. మృతుని తల్లి రెడ్డి కస్తూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆయన మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రెండు ట్రాక్టర్లు సీజ్

బొబ్బిలి: పెంట వేగావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పెంట వేగావతి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ ఆదేశాలు మేరకు ఎస్ఐ ఆర్.రమేష్ తెల్లవారు జామున 4గంటల సమయంలో ఎం.బూర్జవలస వద్ద రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎటువంటి అనుమతులూ లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

బైండోవర్ కేసులు నమోదు

రామభద్రపురం: అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు, నిల్వ చేస్తే కేసులు నమోదు చేస్తామని స్థానిక ఎస్ఐ ప్రసాద్ హెచ్చరించారు. ఈ మేరకు గతంలో కొట్టక్కి, మిర్తి వలస జంక్షన్‌కు చెందిన ఐదుగురు వ్యక్తులు మందుగుండు నిల్వ చేసి అప్పట్లో పట్టు బడ్డారని వారిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

18 మద్యం బాటిళ్లు స్వాధీనం

బొబ్బిలి: పట్టణంలోని ఆకులరెల్లి వీధి శివారులోని సిరుగుడి వీధికి చెందిన అరసాడ శంకరరావు అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి అతన్ని పట్టుకుని 18 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌హెచ్ఒ కె. సతీష్‌కుమార్ తెలిపారు. మద్యం బాటిళ్లను సీజ్ చేసి, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

రేగిడి: మండలంలోని జోడుబందల గ్రామానికి చెందిన బొచ్చ తాతబాబు (42) అదే గ్రామానికి చెందిన నేలబావిలో పడి మృతి చెందాడు. మృతదేహం బావిలో తేలి దుర్వాసన రావడంతో మంగళవారం గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మద్యం మత్తులో నాలుగైదు రోజులు క్రితం బావిలో పడిపోయి ఉంటాడని ఎస్ఐ లీలావతి అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కూలీ పనులు చేసుకుంటున్న మృతుడు తాతబాబుకు ఇద్దరు పిల్లలు, భార్య గీత ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

మెంటాడ: మండల కేంద్రంలో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని ఆంధ్ర ఎస్ఐ సీతారాం పట్టుకున్నారు. 250 పిడిఎస్ రైస్ బ్యాగులు, సుమారు 9వేల కిలోల బియ్యాన్ని వ్యాన్‌పై తరలిసుతండగా ఇద్దనవలస గ్రామ సమీపంలో ఆంధ్ర పోలీసులు మాటువేసి పట్టుకున్నారు. ఈఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

నెల్లిమర్ల: సారిపల్లిలో పేకాట శిబిరంపై పోలిసులు మంగళవారం దాడి చేసి రూ.25వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ గణేష్ అందించిన వివరాల ప్రకారం సారిపల్లిలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి నలుగురుని అరెస్టు చేశామన్నారు.

నగదు అపహరించిన నిందితుడు అరెస్టు

విజయనగరం కోట : ఒక వ్యక్తిని బెదిరించి అతని వద్దగల రూ.50వేలు నగదును అపహరించిన నిందితుడ్ని అరెస్ట్ సినట్లు 1టౌన్ సిఐ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13 పూసపటిరేగ మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన నక్కన లక్ష్మణరావు ఎల్ఐసి కార్యాలయానికి డబ్బులు కట్టేందుకు విజయనగరం వచ్చాడు. అక్కడ టెక్నికల్ సమస్య వల్ల ఆ డబ్బులు కట్టకుండా ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో వైన్ షాప్ కు వద్దకు వెళ్ళినప్పుడు అక్కడ ఒక గుర్తు తెలియని వ్యక్తి పరిచయం చేసుకొని తన స్కూటీ బండి పై లిఫ్ట్ ఇస్తానని చెప్పి కొంత దూరం తీసుకెళ్లి ఇతను వద్ద ఉన్న నగదును దౌర్జన్యంగా లాక్కున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి నిందితుడ్ని అరెస్టు చేసినట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి

ప్రజాశక్తి- మెంటాడ

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తూ వస్తుందని రాష్ట్ర శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని జక్కువ గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె మంగళవారం పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం వారి పార్టీ నాయకులు, అనచరులకే సంక్షేమ పథకాలు అందించిందని, అర్హులైన వారు ఉన్నప్పటికీ పథకాలు అందకుండా ప్రజలు ఏన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నామని చెప్పారు. మెంటాడ మండలంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కోసం స్థల సమీకరణ చేస్తుందన్నారు. మండల ప్రత్యేకాధికారి ప్రమీల గాంధీ, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకటరావు, జనసేన మండల అధ్యక్షులు రాజశేఖర్, గెద్ద అన్నవరం, గొర్లె ముసలి నాయుడు, సర్పంచ్ లచ్చిరెడ్డి సత్యవతి పాల్గొన్నారు.



బొబ్బిలి: స్టిక్కర్లు అతికిస్తున్న టిడిపి నాయకులు

భోగాపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వంద రోజుల పాలన ప్రజలను ఎంతగానో ఆకట్టుకుందని నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. సవరవల్లి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు వైవి రమణ, ఎఒ హరికృష్ణ, ఎంపిడిఒ అప్పలనాయుడు, తహశీల్దార్ సురేష్, ఎపిఒ ఆదిబాబు, కూటమి నాయకులు కర్రోతు రాజు, లక్ష్మణరావు, పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని కుసుమూరులో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు గురించి ప్రజలకు వివరించారు. అనంతరం అంగన్వాడి కేంద్రాలను పరిశీలించి గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెంకటనాయుడు, ఎన్.వెంకటేశ్వరరావు, సిరికి సూర్యనారాయణ, మర్రాపు శంకర్రావు, రెడ్డి శంకర్రావు, యుగంధర్, జనసేననాయకులు మరడాన రవి పాల్గొన్నారు.

బొబ్బిలి: టిడిపితోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని టిడిపి పట్టణ అధ్యక్షులు ఆర్.శరత్, కౌన్సిలర్లు స్వప్న, కె.లక్ష్మి, నాయకులు కె.సత్యనారాయణ, రెడ్డి సత్యం అన్నారు. పట్టణంలోని 20, 25, 26 వార్డులలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని బొద్దాం, సింగరాయి, ఆతవ, వల్లంపూడి వేపాడ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొని మాట్లాడారు. వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన పథకాలు అమలు చేసే విధానంపై ఆమె వివరించారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర రామ సత్యవతి, ఎంపిటిసి పిల్ల లక్ష్మి, సన్యాసిరావు, శ్రీను, ప్రత్యేకాదికారి లక్ష్మీనరసింహం, ఎంపిడిఒ పట్నాయక్ సర్పంచులు పాల్గొన్నారు.



మెంటాడ: మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

రేగిడి: సంకిలి గ్రామంలో ఇంటింటికి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సుప్రియ, డిజిటల్ అసిస్టెంట్ హరిబాబు మంగళవారం పంపిణీ చేశారు.

విజయనగరంటౌన్ : రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పిలుపునిచ్చారు. కాటవీధి లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం రూపొందించిన కరపత్రాలను ప్రజలకు అందించి, స్టిక్కర్లను అతికించారు.

పారిశుధ్య కార్మికుడు మృతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు బొమ్మాన వెంకటి(59) అనారోగ్యంతో మృతి చెందాడు. తోటి పారిశుధ్య కార్మికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. వెంకటి గత మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సెలవుపై ఇంటి వద్దనే ఉన్నాడు. సోమవారం తిరిగి విధుల్లో చేరాడు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న బైరెడ్డి సూర్య నారాయణ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో తనిఖీ చేసుకున్నాడు. వెంకటిని పరీక్షించిన వైద్యులు హై బిపి ఉన్నట్లు గుర్తించారు. బయటకు వచ్చిన వెంకటి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. సహచర కార్మికులు సిహెచ్‌సికి తరలించగా బ్రెయిన్ డెడ్ అయినట్లు అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడి నుంచి జిల్లా ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి విశాఖ కెజిహెచ్‌కి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి బ్రెయిన్ డెడ్, కిడ్నీ ఫెయిల్యూర్‌తో అప్పటికే మృతి చెందినట్లు సోమవారం రాత్రి వెల్లడిం చారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సిఐటియు నాయకులు టివి రమణ, ఎ.జగన్మోహనరావు, కె.రామారావు, యూనియన్ నాయకులు బాబురావు, హరి బాబు, శ్రీను, లక్ష్మీ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పద్మనాభం నివాళులర్పించారు.

చీడ పీడలపై రైతులకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి- మెరకముడిదాం

వరిపంటలో వచ్చే చీడపీడలపై రైతులకు వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు ఆదేశించారు. మండలంలోని గరుగుబిల్లి, శాతం వలస గ్రామాలలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమం ప్రతి మంగళ, బుధ వారాల్లో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతిలాల్ నాయుడు, తాడ్డి చంద్రశేఖర్, మండల రమణ మోహనరావు, డిఎఎటిసి శాస్త్రవేత్త లక్ష్మణ్, ఎడిఎ ఎన్. కోటేశ్వరరావు, ఎఒ శ్రావణితేజ, ఎఫ్‌టిసి ఎఒ టి. సంగీత, రైతులు పాల్గొన్నారు.

రామభద్రపురం: రైతులకు మెరుగైన సేవలు అందించడం కోసమే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని స్థానిక ఎఒ వెంకటయ్య తెలిపారు. మంగళవారం ఇట్లమామిడిపల్లి, నాయుడువలస వివిధ రకాల పంట పొలాలను సందర్శించారు. వరి పంటలో తెల్లచిత్త, పాము పొడ తెగుళ్ల ఉన్నట్లు గుర్తించి వాటి నివారణకు మోనోక్రోటోఫోస్ 36 శాతం హేక్సకొనజోల్ 5 శాతం మందు 2.5 మిల్లి లీటర్ల నీటికి కలిపి ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారులు శర్మ, పిల్ల వెంకటరమణ, ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలో చీడివలస, వియ్యంపేట గ్రామాల్లో ఎఒ మాధురి శరణ్య ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుర్తించిన తెగుళ్ళు, పురుగుల ఫొటోస్ సెంటర్, రాష్ట్ర వ్యవసాయ శాఖకు చెందిన యాప్స్‌లో అప్లోడ్ చేస్తున్నామన్నారు. రైతులను పొలంలోనికి తీసుకెళ్లి క్షేత్ర స్థాయి పరిశీలన చేయించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ ఉద్యాన శాఖ గ్రామ సహాయకులు ప్రశాంత్, కుమారి, అశ్విని స్వప్న, ఎపిసిఆర్‌ఎపి ఐఎఫ్ఎస్ గాజుల రేగకి చెందిన ఎఇఒలు కామేశ్వరరావు, రవి కుమార్, త్రినాథ్, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

దెంకాడ: వరి పండించే రైతులు వ్యవసాయ శాఖ సూచనలు తప్పకుండా పాటిస్తే లాభసాటిగా ఉంటుందని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు తెలిపారు. మండలంలోని చోల్లంగి పేట గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి ఉబాల జరిగిన దగ్గర నుంచి పండించి కోసే వరకు వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు పాటిస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జమదగ్ని, ఎంపిటిసి కిరణ్, ఢీకొల్లం సర్పంచ్ అట్టాడ శివకృష్ణ, అభ్యుదయ రైతు, పొలంబడి రైతులు తదితరులు పాల్గొన్నారు.



మెరకముడిదాం: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

గరివిడి : మండలంలోని గెడ్డపువలస యూనిట్, గెడ్డపువలస గ్రామంలో ఎఒ శైలజ, గ్రామ సర్పంచ్ తుమ్మగంటి సూరినాయుడు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు, గరివిడి యూనిట్ ఇంచార్జి సింహాచలం, తుమ్మగంటి సుశీల, చీడి రామకృష్ణ, సిగ అనసూయ గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

గుర్ల: ఖరీఫ్ పంటలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఒ తిరుపతిరావు అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం తాటిపూడి, వల్లాపురం గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వరి, మొక్కజొన్న, తదితర పంటలను చీడ పీడ, పురుగులు నుండి ఎలా కాపాడుకోవాలో రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు, సర్పంచ్ గుడేల రామకృష్ణ, స్థానిక ఎంపిటిసి, జనసేన నాయకులు రమేష్ రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వేపాడ: ఎరువులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రేగిడి : వరిలో వచ్చే తెగుళ్ల పై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఒ మురళీకృష్ణ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం వెంకంపేట, కందిస గ్రామాలలో అధికారులు పర్యటించి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసా సిబ్బంది, ఇతర అధికారి సిబ్బందితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండలంలోని సీతారామునిపేట, రామతీర్థం గ్రామాల్లో ఎఒ ఎం.పూర్ణిమ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె పంట పొలాలు పరిశీలించి రైతులతో సమావేశం నిర్వహించారు. పంటల స్థితి, నేలను మెరుగు పరచడం, భూసారాన్ని పెంచడం, పంటల మార్పిడి, రకాల ఎంపిక, పురుగులు, తెగుళ్ళు నివారణ, సాగు వ్యయం తగ్గించి ఉత్పాదకతను పెంచడం వంటి అంశాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం.టి వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ కంచరాపు రాము, నాయకులు కోటపాటి తిరుపతి రావు, రైతులు, ఎఇఒ నాగరాజు, పాల్గొన్నారు.

గజపతినగరం: మండలంలోని కాలంరాజుపేటలో మంగళవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రైతుసేవ కేంద్రంలో వ్యవసాయాధికారులు ఖరీఫ్ కాలంలో అధిక దిగుబడులు సాధించడానికి పలు సూచనలు చేశారు. సమగ్ర వ్యవసాయ యాజమాన్య పద్ధతులు, సమగ్ర సస్య రక్షణ చర్యల మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, సరిది దుర్గా ప్రసాద్, సర్పంచ్ ఈశ్వర్ రావు, టిడిపి నాయకులు గేదెల ఈశ్వర రావు, రెడ్డి పోలి నాయుడు, గేదెల త్రినాథ, శంకర్ రావు, రెడ్డి పాపి నాయుడు, ఇంఛార్జి వ్యవసాయాధికారి లోకేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: సుస్థిర వ్యవసాయంతో లాభాలు పొందవచ్చునని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని కొండ గంగుపూడి గ్రామంలో నిర్వహించిన సుస్థిర వ్యవసాయంపై అవగాహన సదస్సులో మంగళవారం ఆమె పాల్గొని మాట్లాడారు. సుస్థిర వ్యవసాయ సాగు పద్ధతులను ప్రతి ఒక్కరు అవలంబిస్తే మంచి లాభాలు పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహం, ఎంపిడిఒ పట్నాయక్ జిడిఎఆర్ అన్నపూర్ణ, అనురాధ, ఎఒ యశ్వంత్ కుమార్, టిడిపి నాయకులు సిహెచ్ వెంకటరావు, దాసరి లక్ష్మి సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే వేడుకలు

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక పశువైద్య కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథక (ఎన్ఎస్ఎస్) దినోత్సవ వేడుకలను కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మక్కెన శ్రీను అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞానంతో పాటు విద్యార్థులకు సమాజం పట్ల భాధ్యత, సేవా గుణం కలిగి ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి సమాజ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఎస్ఐ లోకేశ్వర్ రావు మాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలు పెరగటం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతోందన్నారు. ఆర్‌వికె దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గరివిడి పశువైద్య కళాశాల చేస్తున్న విభిన్న జాతీయ సేవా కార్యక్రమాల గురించి కొనియాడారు. ఈ సందర్భంగా గరివిడి, చీపురుపల్లి మండలాలలో ఉన్న డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ తయారీ వంటి అంశాలపై పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. అనంతరం ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లకు స్కార్ఫ్, బ్యాడ్జీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెథోలజిస్ట్ డాక్టర్ ఎన్. ఝాన్సిరాణి డాక్టర్ సుధారాణి, విద్యార్థి సంబంధ వ్యవహారాల అధికారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ షేక్ మస్తాన్‌బి, డాక్టర్ జి. యస్. హరిత, డాక్టర్ యస్. గంగునాయుడు, పాల్గొన్నారు.

అవంతీ ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రతిభ

ఎన్ఎస్ఎస్ డేను పురస్కరించుకుని స్థానిక శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ తయారీ విభాగాల్లో అవంతీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారు. వక్తృత్వ ఇంగ్లీష్ మీడియం విభాగంలో బిటెక్ సిఎస్ఎం ఎస్.గౌతమీకు ప్రథమ, వ్యాసరచన తెలుగు విభాగంలో బి.టెక్ సిఎస్ఈ విద్యార్థి ఎస్. శైలజకు ప్రథమ, కె. సత్యవతికు తృతీయ, ఇంగ్లీష్ మీడియంలో కె.అశ్వినికు ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ విద్యార్థులను అభినందించారు.

గుర్ల : విద్యార్థులు సమజాసేవ పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ ఆర్ సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ విద్యార్థులు సమాజ సేవలో పాల్గొంటూ, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.ప్రసాద్, గంగరాజు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల



పోటీలను ప్రారంభిస్తున్న ఆనంద్‌కుమార్

స్థానిక థామస్‌పేట ఫుట్‌బాల్ మైదానంలో మంగళ వారం జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు, ఎంపికలు నిర్వహించారు. పోటీలను నగర పంచాయతీ చైర్ పర్సన్ సరోజినీ, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. అండర్ 14, అండర్ 17 విభాగంలో బాల, బాలికలు కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ చెస్, యోగా, అథ్లెటిక్ పోటీలకు ఎంపికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ టివిఎస్ విశ్వేశ్వర రావు, టిడిపి నాయకులు లెంక అప్పల నాయుడు, నల్లం శ్రీనివాసరావు, ముదుమంచి లక్ష్మణ రావు, జనసేన నాయకులు బంగారు శంకర రావు, బంగారు భాను ప్రకాష్, అంబళ్ల అప్పలనాయుడు, నల్లి చంద్రశేఖర్, తుమ్ము వెంకట రమణ, రవ్వానాని, గదల అచ్చం నాయుడు, ఎంఇఒ యుఎస్ఎన్ మూర్తి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కో ఆర్డినేటర్ ప్రమీల పాత్రో, నియోజక వర్గం కో ఆర్డినేటర్ జి. తవిటి నాయుడు, రిటైర్డు పీడీ బొమ్మన రామారావు, పిఇటిలు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలో రైతులు కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ యం.శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం మాట్లాడుతూ మండలంలో రైతులు, కౌలు రైతుల ఇబ్బందులపై బొబ్బిలి తహశీల్దార్ ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేసామన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలై సగం రోజులు గడిచాయని ఇప్పటి వరకు రైతులకు అన్నదాత పెట్టుబడి సాయం కింది ప్రభుత్వం ఇస్తామన్న రూ.20 వేలు వెంటనే ఇవ్వాలని, అన్ని పంటలకు ఉచిత పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అ సంఘ నాయకులు ఉడమల ప్రసాదు, రెడ్డి త్రినాధ తదితరులు పాల్గొన్నారు

చెరువు నకు ట్రెంచ్ కటిగ్ చెయ్యాలి

రంగరాయపురానికి చెందిన దాలిందల చెరువు చుట్టూ ట్రెంచి కటింగ్ చెయ్యాలని ఈ గ్రామ రైతులు తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చెరువు నీరు ఒత్తిడి ఎక్కువ అయినప్పుడు చెరువు కిందనున్న తమ భూములు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ఒత్తిడి నిరోధించేందుకు తగిన పరిస్కారం చూపాలని వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ఈసరపు రామారావు, బాబురావు, వంగపండు శంకరరావు, తులసి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సాగు హక్కు కల్పించాలి

కొత్తవలస: జిల్లాలో కౌలు రైతులకు సాగు హక్కు కల్పించాలని కోరుతూ నిమ్మలపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సాగు హక్కుదారులు మంగళవారం ధర్నా చేశారు. అన్నదాత పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే ఇవ్వాలని, రైతుల పండించిన అన్ని పంటలకు ఉచిత బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సాగు రైతులకు రెండు లక్షల వరకు ఆర్థిక సహాయం అందించాలని, 2023 సంవత్సరానికి గాను పంటల బీమా అమలు చేయాలని, ఉచిత బీమా పథకం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. సిపిఎం నాయకులు గాడి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రైతులు గొంప కృష్ణమూర్తి, కె.శ్రీనివాసరావు, గొంప నరసింహారావు, జి.రాము, జి. వరలక్ష్మి, గొంప వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కొప్పర కొత్తవలసలో రోగులు ఆందోళన

ప్రజాశక్తి - వంగర

మండలంలోని కొప్పర పంచాయతీ కొత్తవలస గ్రామంలో 104 వాహనం వద్ద రోగులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. వైద్య సేవలు అందించేందుకు 104 వాహనంతో పాటు ఎఎన్ఎం, మంగమ్మ, ఆశా కార్యకర్త సింహాలమ్మ కొత్తవలస గ్రామానికి మంగళవారం చేరుకున్నారు. అయితే కనీసం ఎంఎల్‌హెచ్‌పి గాని, వైద్యాధికారి గాని లేకుండా మీరు ఎలా తనిఖీలు చేస్తారని రోగులు ఇబ్బంది పడుతున్నారని సంబంధిత అధికారి ఫోన్ నెంబర్ ఇవ్వాలని గుడివాడ గోవిందరావుతో పాటు గ్రామస్తులు ఏఎన్ఎం ను కోరారు. ఆమె వంగర ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి సెల్ నెంబరు ఇవ్వడంతో ఆ ఉద్యోగిని ఫోన్లో ప్రశ్నించారు. సమాచారం ఇవ్వవలసిన ఉద్యోగి తమతో దురుసుగా మాట్లాడారంటూ వైద్య సేవలు నిలిపివేయాలని, జిల్లా కలెక్టర్, డి ఎంహెచ్ఒకి ఫిర్యాదు చేస్తామని రోగులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఫోన్లో దురుసుగా మాట్లాడిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో వంగర పిహెచ్‌సి వైద్యధికారిణి సిహెచ్ జ్యోతి కొత్తవలస గ్రామానికి చేరుకొని రోగులకు తనిఖీలు చేపట్టి మందులు పంపిణీ చేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంలో విఫలం

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యుత్ సమస్యలు పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెడ్డిక వీధిలో మూడు రోజుల క్రితం గాలి, వానకు స్తంభంపై విద్యుత్ సమస్య తలెత్తి పి.రామారావు ఇంటికి విద్యుత్ సరఫరా నిలిచిపోతే సమస్యను పరిష్కరించక పోవడంతో చీకటిలో నివసించి దోమలతో బాధ పడి పిల్లలకు చదువులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. విద్యుత్ శాఖాధికారులు నిర్లక్ష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్ సమస్యలపై తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిబ్బంది కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, సభ్యులు ఉన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపిపిపి డి. సత్యవంతుడు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వస్తారని ఉదయం 11 గంటలకు ఎంపిటిసిలు, సర్పంచులు సకాలంలో హాజరు కావాలని కోరారు.